సాక్షి ఖమ్మం

సోమవారం, 13, అక్టోబర్, 2025



ఘాటు తగ్గిన మిర్చి

గతేడాది మిరపకు ధర బాగా తగ్గడంతో ఈ సంవత్సరం ఆ పంట సాగుకు పలువురు రైతులు సుముఖత చూపడం లేదు. 8లో



పైరవీలకే పెద్దపీట ?

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో పైరవీలు. పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యం కల్పించారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

28° / 22°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉద్యోగులకు అండగా ఉంటాం

టీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి



ఏలూరికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్ : ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు తాము అండగా ఉంటామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న జేఏఓలు, ఏఓలకు గెజిటెడ్ హోదా కల్పించేలా కృషి చేయాలని కోరుతూ ఏఓ శివలింగం వినతిపత్రం అందించగా.. ఏలూరి మాట్లాడారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టీజీఓస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, కొండపల్లి శేషుప్రసాద్, టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి కొణిదన శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు రుక్మారావు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న పోటు రంగారావు

తిరుమలాయపాలెం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తయాని ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మండలంలోని తెట్టెలపాడులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని, తక్షణమే నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రిజర్వేషన్ల పేరుతో ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని, గవర్నర్‌తో ఆమోదింపజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు గుర్రం అచ్చయ్య, పుసులూరి నరేందర్, కూసు అప్పారావు, బందెల వెంకయ్య, రేపాకుల శివలింగం, నాగేశ్వరరావు. కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, గిరిబాబు, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనక దుర్గమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: శ్రీకనక దుర్గమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుందర వనం !

ఖమ్మం నగరంలో పచ్చదనం పరిఢవిల్లుతోంది. నగర పాలక సంస్థ (కేఎంసీ) ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంతో పార్కులు, ప్రధాన రహదారులు, వాకింగ్ ట్రాక్‌లు, డివైడర్లు హరిత శోభ సంతరించుకుని ఆహ్లాదం పంచుతున్నాయి. వన మహోత్సవంలో లక్ష్యాలకు అనుగుణంగా వివిధ శాఖల అధికారులు రకరకాల మొక్కలు నాటడంతో పచ్చదనంతో నిండిపోయాయి. నాటిన ప్రతీ మొక్క సంరక్షణకు కేఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. – ఖమ్మంమయూరిసెంటర్



వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా నాటిన మొక్కలు..



పచ్చదనం పరుచుకున్న పీవీ నరసింహారావు పార్కు

ఖమ్మంలో పరిఢవిల్లుతున్న పచ్చదనం

- కేఎంసీ పరిధిలో ఆహ్లాదంగా పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు
- నగర వాసులకు ఆహ్లాదం పంచేలా మొక్కలు
- ఈసారి ఆదాయం ఇచ్చే మొక్కల పెంపకం కూడా..

ఆకర్షణీయంగా మొక్కలు..

నగరంలోని పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ట్యాంక్ బండ్‌లు, రహదారుల వెంట, డివైడర్లలో మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. మొక్కలు నాటడం, వాటిని పెంచడంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య.. ఉద్యాన అధికారిణికి ప్రత్యేకంగా సూచనలు చేస్తున్నారు. దీంతో డివైడర్లతో పాటు పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల్లో మొక్కలను ఆకర్షణీయంగా పెంచుతున్నారు. పెరిగిన కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరిస్తున్నారు. పార్కులకు వచ్చే వారిని ఈ మొక్కలు కనువిందు చేస్తున్నాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వారికి ఈ పచ్చటి వాతావరణం మానసిక ప్రశాంతతను అందిస్తోంది.

వక్క మొక్కలు కూడా..

ఈ ఏడాది నగరంలో 4 లక్షలకు పైగా మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు 90 శాతం పూర్తి చేయగా.. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మరో రెండు పార్కుల్లో మొక్కలు నాటాల్సి ఉంది. అయితే ఈ ఏడాది పూలు, పండ్ల మొక్కలతో పాటు కేఎంసీకి ఆదాయం తీసుకొచ్చే మొక్కలకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి పలు ప్రదేశాల్లో నాటారు. నగరంలో 6వేల వక్క మొక్కలను ప్రత్యేకంగా నాటించారు. కేఎంసీ డంపింగ్ యార్డ్‌లోని ఖాళీ స్థలంలో అత్యధికంగా 10 వేల మొక్కలు ఒకే చోట నాటగా.. వీటిలో నీడనిచ్చేవి, పండ్ల మొక్కలు ఉన్నాయి. వీటి చుట్టూ బ్యాంబూ మొక్కలను బోర్డర్‌లా పెంచుతున్నారు. ఇక నగరంలో 36 కిలోమీటర్ల మేర ఉన్న డివైడర్ల మధ్య వక్క, టాల్ ప్లాంట్స్, కాగితపు పూల మొక్కలు నాటారు.



వక్క మొక్కల సంరక్షణలో సిబ్బంది

విజయవంతంగా వన మహోత్సవం..

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం ఖమ్మంలో విజయవంతమైందని అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటడంతో నగరంలో పచ్చదనపు విస్తీర్ణం పెరిగింది. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణకు కేఎంసీ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పుడు నగరానికే మణిహారంగా మారింది.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



నగరంలోని పార్కులు, డివైడర్లు, వాకింగ్ ట్రాక్‌ల్లో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ఈ ఏడాది వన మహోత్సవంలో పూలు, పండ్లు, వక్క, బ్యాంబూ మొక్కలు నాటించాం. రహదారుల వెంట ట్రీ గార్డులు ఏర్పాటు చేయించాం. డివైడర్లు, పార్కుల్లో నాటిన మొక్కలను ఆకర్షణీయంగా పెంచుతున్నాం.

– బిల్లం రాధిక, ఉద్యాన అధికారి, కేఎంసీ

ఏటీసీ.. అంతా రెడీ



ఏటీసీలో అందుబాటులో ఉన్న పరికరాలు

- నేడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ఐటీఐ కళాశాలలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లుగా అప్‌గ్రేడ్ చేసింది. తొలి విడతలో రాష్ట్రంలో మూడు ఐటీఐలను ఏటీసీలుగా మార్చగా అందులో ఖమ్మం నగరంలోని టేకులపల్లి ఐటీఐ కూడా ఉంది. 2024 – 25 విద్యా సంవత్సరంలో ఈ సెంటర్‌కు ఆరు కొత్త కోర్సులు మంజూరయ్యాయి. వాటిలో గత, ప్రస్తుత విద్యాసంవత్సరాల్లో 172 చొప్పున సీట్లు కేటాయించగా అన్నీ భర్తీ అయ్యాయి.

రూ.13 కోట్లు కేటాయింపు..

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.77 కోట్లు కేటాయించగా పనులు పూర్తయ్యాయి. కాగా, టాటా టెక్నాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మరో రూ.8 కోట్ల వ్యయంతో విద్యార్థులకు అవసరమైన పరికరాలు, ఫర్నిచర్, బోధన సిబ్బందిని సమకూరుస్తున్నారు. కళాశాలలో ఉన్న పాత భవనంలోనే ఇప్పటివరకు విద్యార్థులకు బోధన చేశారు. అయితే తరగతి గదులు, ఇతర సమస్యలు నెలకొన్న నేపథ్యంలో నూతన భవనాన్ని నిర్మించారు. ఏటీసీ భవనం సోమవారం ప్రారంభమైతే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి..

నేడు ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏటీసీ భవనాన్ని ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరవుతారని ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. వీరితో పాటు ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, గారపాటి రేణుకా చౌదరి, రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, తీన్మార్ మల్లన్న, పింగళి శ్రీపాల్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్‌ను కూడా ఆహ్వానించామని వివరించారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ తదితరులు

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల పాలయినా, ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేకున్నా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతోందని చెప్పారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న వెంకటగిరిలో ఖమ్మం – కోదాడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జీ ప్లస్ – 2 కాలనీ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా దీవెనలతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.1.53 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం నిర్మిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాకు రూ.10 లక్షలు ఖర్చు చేశామని చెప్పారు. వెంకటగిరి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జంగాల కాలనీ, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి నుంచి కోటనారాయణపురం మీదుగా ఇందిరమ్మ కాలనీ, వెంకటగిరి ఎస్సీ, బీసీ కాలనీ నుంచి గుదిమళ్ల వరకు రోడ్లు మంజూరు చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీలో అదనపు నిధులు మంజూరు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అక్కడే అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి.. త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయం నిర్మిస్తే ఆధ్యాత్మిక శోభ

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి స్థల పరిశీలన

ఖమ్మంఅర్బన్: జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయితే ఆధ్యాత్మిక, పర్యాటక శోభ సంతరించుకుంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆలయ నిర్మాణానికి అనువైన స్థలాల ఎంపిక కోసం ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం, అల్లీపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీటీడీ ఆలయ నిర్మాణానికి అనువైన పలు స్థలాల ప్రతిపాదనలు పరిశీలించామని, రహదారి అనుసంధానం, భౌగోళిక అనుకూలత, వసతిగృహాల ఏర్పాటుకు గల సౌకర్యాల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. టీటీడీ అధికారులు, స్థపతులు, పండితులు త్వరలో ఖమ్మానికి వచ్చి తుది స్థలాన్ని ఖరారు చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో అర్డీఓ జి.నరసింహారావు, అర్బన్ తహసీల్దార్ డి.సైదులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

కిన్నెరసానిలో సండే సందడి

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాల నడుమ సరదాగా గడిపారు. 496మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,390 ఆదాయం లభించింది. 480మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.24,410 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

'సౌర' పందెం.. రూ.కోటి ఖాయం

- ఉమ్మడి జిల్లాలో కొణిజర్ల, భద్రాచలం ఎంపిక
- ఎంఎన్‌ఆర్‌ఈ ద్వారా ప్రజలకు ఉపయోగపడేలా సోలార్ ప్లాంట్లు
- 'గృహజ్యోతి'తో ఇంకా ముందుకు రాని ప్రజలు

ఖమ్మంవ్యవసాయం: సౌర విద్యుత్ ఉత్పత్తిని విస్తృతపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలతో కూడిన పథకాలను అమలుచేస్తోంది. ప్రధాన మంత్రి సూర్యఘర్, ప్రధానమంత్రి కుసుమ్ వంటి పథకాలు ఉండగా.. మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెనివబుల్ ఎనర్జీ(ఎంఎన్‌ఆర్‌ఈ) పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ విలేజ్‌లకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. నిబంధనల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించిన గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడేలా ఈ నిధులు వినియోగిస్తారు. మోడల్ సోలార్ విలేజ్‌గా పరిగణించడానికి తాజా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 5 వేలకు మించి ఉండాలి. ఇక 2025 ఏప్రిల్ నుంచి ఆరు నెలల కాలాన్ని గడువుగా నిర్దేశించగా.. ఈ సమయంలో నిబంధనల ప్రకారం అధికంగా సౌర విద్యుత్ కనెక్షన్లు, సామర్థ్యాన్ని బట్టి జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తారు. ఆ గ్రామానికి ఎంఎన్‌ఆర్‌ఈ పథకం కింద రూ. కోటి విలువైన సౌర ప్లాంట్ల నజరానా ప్రకటించారు. దేశవ్యాప్తంగా అమలుచేస్తున్న ఈ పథకాన్ని ఖమ్మం జిల్లాలో ఏప్రిల్ 4 నుంచి అక్టోబర్ 3 వరకు, భద్రాద్రి జిల్లాలో ఏప్రిల్ 9 నుంచి అక్టోబర్ 8వరకు అమలు చేశారు. విద్యుత్‌శాఖ పర్యవేక్షణలో రెడ్‌కో సంస్థ ఈ పోటీలు నిర్వహించింది.



పోటీ పడిన గ్రామాలు 22..

ఎంఎన్‌ఆర్‌ఈ పథకం కింద నిబంధనల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 22 గ్రామాలు ఎంపికయ్యాయి. ఖమ్మం జిల్లాలో అన్నారుగూడెం(తల్లాడ మండలం), నేలకొండపల్లి, కొణిజర్ల, వల్లభి(ముదిగొండ మండలం), తనికెళ్ల(కొణిజర్ల మండలం), తల్లాడ, ముదిగొండ, కందుకూరు(వేంసూరు) గ్రామాలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో అశ్వాపురం, భద్రాచలం, సారపాక, నాగినేనిప్రోలు(బూర్గంపాడు మండలం), రుద్రంపూర్(చుంచుపల్లి మండలం), దమ్మపేట, కూనవరం(మణుగూరు మండలం), ముల్కలపల్లి, బూర్గంపాడు, చంద్రుగొండ, బాబూక్యాంప్(చుంచుపల్లి మండలం), మందలపల్లి(దమ్మపేట మండలం), సమితి సింగారం(మణుగూరు మండలం) చర్ల గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అర్హులైన వారికి సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సూర్య ఘర్ పథకం కింద రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఇంటి పైకప్పు 100 నుంచి 300 ఆపైన స్క్వేర్ ఫీట్ ఉన్న భవనాలకు అవకాశం కల్పించారు. ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు రూ.30 వేల రాయితీ, 2 కిలోవాట్ల సౌరప్లాంట్‌కు రూ. 60 వేలు, 3 కిలోవాట్ల సౌరప్లాంట్‌కు రూ.78 వేల రాయితీ సౌకర్యం కల్పించారు.

రూ.కోటి నజరానా

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో నిర్వహించిన మోడల్ సోలార్ విలేజ్ పథకం పోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి కొణిజర్ల, భద్రాద్రి జిల్లా నుంచి భద్రాచలం గ్రామాలు విజేతలుగా నిలిచాయి. భద్రాచలంలో 180 విద్యుత్ సర్వీసులు సౌర విద్యుత్‌కు అనుసంధానం పొందగా 2 వేల కిలోవాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పునరుత్పత్తి చేస్తున్నాయి. ఖమ్మం జిల్లా కొణిజర్ల కూడా అత్యధికంగా పోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని ముందంజలో నిలిచింది. దీంతో ఈ రెండు గ్రామాలను రెండు జిల్లాల స్థాయిలో మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపిక చేశారు. సోలార్ పథకం కింద విజేతలుగా నిలిచిన గ్రామాలకు విడుదల చేసే రూ. కోటి నిధులను ఆయా గ్రామాల్లో ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని నిర్దేశించారు.

ప్రభావం చూపుతున్న 'గృహజ్యోతి'

రాష్ట్ర ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని గృహజ్యోతి పథకం కింద కల్పించింది. గ్రామాల్లో 80 శాతం మంది విద్యుత్ కనెక్షన్లు ఈ పథకంలో ఉన్నాయి. దీంతో ఉచిత విద్యుత్ పొందుతున్న లబ్ధిదారులు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. 3 కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటుకు కంపెనీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు ఖర్చవుతుంది. కిలోవాట్లు తగ్గితే వ్యయం కూడా తగ్గుతుంది. అయితే ఈ పథకం ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పించినా.. వినియోగదారులకు సిబిల్ స్కోర్ ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. చాలా మందికి సిబిల్ స్కోర్ సరిగా లేక రుణాలకు అర్హత సాధించలేకపోయారు. దీంతో మోడల్ సోలార్ విలేజ్ పథకానికి అంతగా ఆసక్తి చూపడం లేదు.

నిర్విరామ కృషితోనే సాధ్యం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ మేనేజర్లు, సిబ్బందికి అభినందన

దమ్మపేట:అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు, సిబ్బంది నిర్విరామ కృషితోనే మూడు లక్షల టన్నుల పామాయిల్ గెలల క్రషింగ్ సాధ్యమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిర్దేశిత క్రషింగ్ లక్ష్యాన్ని సాధించిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీ ప్రాంగణంలో అధికారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల మేనేజర్లు కళ్యాణ్, నాగబాబులతోపాటు సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయిల్‌పామ్ సాగులో ఎకరాకు 12 టన్నులు పైబడి దిగుబడి సాధించిన రైతులు స్వీయ అనుభవాలను వివరించారు. వారినీ సన్మానించారు. మహారాష్ట్రకు చెందిన రైతు చంద్రశేఖర్ వ్యవసాయంలో అనుసరిస్తున్న రీజనరేటివ్ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రీజనరేటివ్ విధానాన్ని పరిశీలించేందుకు 40 మంది రైతులను అక్కడికి పంపుతామన్నారు.



అప్పారావుపేట ఫ్యాక్టరీ కేక్ కట్‌చేస్తున్న మంత్రి తుమ్మల, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ తదితరులు

అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించి, రాబోయే సంవత్సరానికి నూతన ఫ్యాక్టరీ నిర్మించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌ఫెడ్ సిబ్బందికి పదోన్నతి కల్పించాలన్నారు. తోటల్లో ఆయిల్‌పామ్ చెట్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు లైన్లను మార్చాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్‌ను ఆదేశించారు. అప్పారావుపేట గ్రామ అభివృద్ధి, అశ్వారావుపేటలో డివైడర్ నిర్మాణానికి ఆయిల్‌ఫెడ్ నిధులు కేటాయిస్తామన్నారు. ములకలపల్లి మండలంలో పది వేల ఎకరాల సాగు విస్తీర్ణం దాటితే ఫ్యాక్టరీ నిర్మిస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

15 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం..

ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ మొక్కలను పెంచడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అత్యధిక ఓఈఆర్ 19.92ను సాధించడంతో రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ రైతులు మునగ, వెదురు, కూరగాయలు సాగు, పట్టు పురుగుల పెంపకంపై కూడా దృష్టి సారించాలని అన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ పేటలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీ నెలకొల్పాలని, అచ్యుతాపురంలో ఖాళీగా ఉన్న 40 ఎకరాల భూ విస్తీర్ణంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఓఎస్‌డీ కిరణ్ కుమార్, డివిజనల్ మేనేజర్ రాధాకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, నాగబాబు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, కాసాని నాగప్రసాద్, కె.వి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ ఓ రాజకీయ కుట్ర



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై అతిపెద్ద రాజకీయ కుట్ర జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ పేరుతోనే దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందా? అని, ముఖ్యమంత్రి పదవికి సామాజిక న్యాయం అవసరం లేదా..? అని ప్రశ్నించారు. పంజాబ్, హరియాణాలో తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టిందని, దానిని ప్రధానమంత్రి మోదీ దేశవ్యాప్తం చేశాడని ఆరోపించారు. శాస్త్రీయత లేని, రాష్ట్ర జనాభా లెక్కలతో ఎస్సీ రిజర్వేషన్ వల్ల చాలా తక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో కామ ప్రభాకర్‌రావు, బల్లెం లక్ష్మణ్, మిరియాల బాలశౌరి, తోట దుర్గాప్రసాద్, కనికెళ్ల నాని, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా జె.సోమన్న (ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.సునీల్ రెడ్డి (బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్), ఉపాధ్యక్షులుగా పి.అజయ్, ఎస్.కుమారస్వామి, బి.రమేశ్, జి.సునీత, కోశాధికారిగా ఎస్.కిరణ్‌కుమార్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.కుమారస్వామి, కె.మధుకర్, బి.వెంకట్రామ్, జె.జేత్యాతోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మహ్మద్ కరీం వ్యవహరించారు. నాలుగేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది.

వడ్డీ వ్యాపారులకు మావోయిస్టుల హెచ్చరిక

దుమ్ముగూడెం: అవసరాన్ని బట్టి పేద ప్రజల వద్ద పెద్ద మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులను హెచ్చరిస్తూ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న పేరుపై మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. అధిక వడ్డీలు కట్టలేని పరిస్థితిలో పేదలు ఉన్నారని, పద్ధతి మార్చుకోవాలన్నారు. వ్యాపారుల దౌర్జన్యాలు తట్టుకోలేక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొందరు చనిపోతున్నారని, మరికొందరు ఆస్తులు అమ్ముకుని రోడ్డుపై పడుతున్నారని తెలిపారు.

గైనకాలజిస్టులు లేక బాలింత కొత్తగూడెం తరలింపు

గర్భంలోనే శిశువు మృతి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టులు లేక సరైన సమయంలో వైద్యం అందక గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ఎర్రవు వినయ్ సివిల్ విభాగంలో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, భార్య స్వాతి 9 నెలల గర్భిణి. స్వాతికి తరచూ షుగర్ రావడంతో రోజూ క్రమం తప్పకుండా ఇన్సులిన్ వేసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో మణుగూరు సింగరేణి ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో భర్త వినయ్ కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ క్రమంలో మణుగూరు ఆస్పత్రికి సాధారణ పరీక్షల కోసం వెళితే కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి రిఫర్ చేశారని అక్కడ గుండె చప్పుడు పరిశీలించిన వైద్యులు ప్రైవేట్ స్కాన్ చేయించగా, అప్పటికే శిశువు మృతి చెందిందని తెలిపారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ ఉంటే శిశువు ప్రాణం దక్కి ఉండేదని కన్నీటి పర్యంతమయ్యాడు.

ఆదివాసీలు ఉద్యమించాలి


కొమురంభీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

టేకులపల్లి: ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాటాలు నిర్వహించిన కొమురం భీమ్ ఆశయ సాధనకు ఆదివాసీలు ఉద్యమించాలని తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ కల్తి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివా రం కొమురం భీమ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ కావాలంటూ నైజాం నవాబులు, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరు సల్పారని అన్నారు. భద్రాచలంలో జరిగిన ధర్మ యుద్ధం సభ సక్సెస్ కావడంతో కొందరు లంబాడీ నాయకులు తప్పుడు కేసులు పెడుతున్నారని, ఆదివాసీ ఉద్యమాన్ని అణచివేయ డానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

ఘాటు తగ్గిన మిర్చి

- ఈ ఏడాది గణనీయంగా పడిపోయిన సాగు
- ధర లేకపోవడంతో రైతుల అనాసక్తి
- సాగు చేసిన తోటల్లోనూ కలుపు ప్రభావం
- పంటకు పెరుగుతున్న పెట్టుబడి


మిరప మొక్కలను కమ్మేస్తూ పెరిగిన కలుపు

తల్లాడ: ఈ ఏడాది జిలాల్లో మిర్చి సాగు గణనీయంగా తగ్గింది. ధర పెరగకపోవడం, చీడపీడల కారణంగా గతేడాది మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. కొన్నిచోట్ల పంట అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావనే ఉద్దేశంతో చేతికందిన మిర్చిని తోటల్లోనే వదిలేశారు. దీంతో ఈ ఏడాది చాలా మంది రైతులు పత్తి వైపు మొగ్గుచూపారు.

సగానికి తగ్గిన సాగు..

జిల్లాలో గతేడాది 70వేల ఎకరాల్లో మిర్చిసాగు చేయగా ఈ సంవత్సరం ఇప్పటివరకు 30 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇంకా అక్కడక్కడా మరో ఐదు వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. జూన్, జూలైలో మిర్చి నారు పోయగా సెప్టెంబర్ మొదటి వారం నుంచి సాగు పనులు ప్రారంభించారు. ఈ ఏడాది మిరప సాగు విస్తీర్ణం తగ్గడంతో జిల్లాలోని పలు నర్సరీల్లో పెంచిన మిరపనారు మిగిలి పోయింది. చాలా నర్సరీల్లో వేలాది మొక్కలు మిగిలిపోగా, నిర్వాహకులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

రైతులపై కలుపు భారం

ఈ ఏడాది మిర్చి రైతులను కలుపు బెడద తీవ్రంగా వేధిస్తోంది. సాగు చేసిన నెల రోజుల్లోనే అధిక వర్షాలతో కలుపు బాగా పెరిగింది. తద్వారా మిరప మొక్కల ఎదుగుదల లోపించి దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలతో కలుపు తీయించాలంటే ఎకరానికి రూ.20 వేల వరకు ఖర్చువుతోంది. ఇప్పటికే దుక్కి, నారు, ఎరువులకు రూ.40 వేల వరకు ఖర్చు చేయగా పంట చేతికందేసరికి ఎకరాకు రూ.లక్ష దాటుతోందని రైతులు అంటున్నారు.

గిట్టుబాటు ధర లేక నష్టం..

గతేడాది మిర్చి సాగు చేసిన రైతులకు సరైన ధర లేక తీవ్రంగా నష్టపోయారు. బంగ్లాదేశ్, చైనా దేశాల్లో మిర్చి సాగు పెరగడంతో విదేశీ ఎగుమతులు లేక ధర పెరగడం లేదు. మధ్యప్రదేశ్‌లోనూ గత ఖరీఫ్‌లో మిర్చి దిగుబడి పెరగడంతో ఇక్కడి పంటకు డిమాండ్ తగ్గింది. ఖమ్మం మార్కెట్‌లో జెండా పాట క్వింటా రూ.13 వేలకు మించలేదు. ఇక కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

కలుపు బాగా పెరిగింది


మిర్చి సాగు చేసిన నెల రోజులకే అధిక వర్షాలతో కలుపు బాగా పెరిగింది. దీంతో మిరప మొక్కల ఎదగడం లేదు. కూలీలతో కలుపు తీయిస్తున్నా మళ్లీ పెరుగుతోంది. ఒక్కో కూలీకి రూ.400 చొప్పున ఎకరానికి 20 మంది కూలీలను పెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది ఈ ఖర్చు అదనం.
– వేమా అర్జున్‌రావు, బిల్లుపాడు

నష్టమే మిగిలింది



ఈ ఏడాది కూడా మిర్చి నర్సరీలకు నష్టమే మిగిలింది. రూ.లక్షల పెట్టుబడితో నారు పెంచితే రైతులు పూర్తిగా కొనుగోలు చేయక మిగిలిపోయింది. వరుసగా రెండేళ్ల పాటు నష్టాలే వస్తున్నాయి. మిరప సాగు పూర్తిగా తగ్గిపోవడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.
– కిషోర్‌రెడ్డి, నర్సరీ యజమాని, నారాయణపురం

అధిక వర్షాలతోనే కలుపు


ఈ ఏడాది మిర్చి రైతులకు కలుపు భారంగానే మారింది. వర్షాలు అధికంగా పడడంతో మిరప కంటే కలుపు మొక్కలే బాగా పెరుగుతున్నాయి. తద్వారా రైతులకు కూలీల ఖర్చు భారం అవుతోంది.
– మధుసూదన్‌రావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి

పైరవీలకే పెద్దపీట..?

- టీచర్ల కేటాయింపుల్లో లోపాలున్నాయని ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



సత్తుపల్లి: పైరవీలు చేసినవారు, పలుకుబడి ఉన్న ఉపాధ్యాయులను వారికి నచ్చిన స్థానాల్లో సర్దుబాటు చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం డీఈఓగా ఐఏఎస్ అధికారిణి బాధ్యతల్లో ఉన్నప్పటికీ కొందరు ఎంఈఓలు తప్పుదోవ పట్టించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా పలుకుబడి కలిగిన ఉపాధ్యాయులను ఏకంగా జిల్లా కేంద్రానికి సమీపంలో సర్దుబాటు చేశారనే చర్చ సాగుతోంది. దసరా సెలవుల ముందు సర్దుబాటు ప్రక్రియ చేపట్టి, ఉన్న ఫలంగా విధుల్లో చేరాలని ఉత్తర్వులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు తెలిసింది. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో సర్దుబాటు, పైరవీలు, అవతవకలపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపించేందుకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని కలిసి సర్దుబాటులో లోపాలపై ఫిర్యాదు చేయగా మండల అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది.

ఇన్‌చార్జ్ ఎంఈఓల పాఠశాలలకు..

సత్తుపల్లి నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎంఈఓలందరూ ఇన్‌చార్జ్‌లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు కాకర్లపల్లి జెడ్పీహెచ్ఎస్, వేంసూరు ఎంఈఓ చల్లంచర్ల వెంకటేశ్వరరావు చౌడారం హైస్కూల్, పెనుబల్లి ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ వీఎం బంజర్ జెడ్పీహెచ్ఎస్‌ల్లో హెచ్ఎంలుగా పనిచేస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియలో వారు పనిచేస్తున్న పాఠశాలలకు ఇబ్బందులు రాకుండా ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశంపై సత్తుపల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేశ్వరరావును వివరణ కోరగా.. ప్రభుత్వ జీఓ ప్రకారం సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశామని, ఎలాంటి అక్రమాలకు తావు లేదని స్పష్టం చేశారు.

అవకతవకలెన్నో..

పెనుబల్లి మండలం కొండ్రుపాడు జెడ్పీహెచ్ఎస్ హిందీ ఉపాధ్యాయుడు గంగరాజును బోనకల్ మండలం ఆళ్లపాడు జెడ్పీహెచ్ఎస్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. కొండ్రుపాడు పాఠశాలకు గణేశ్‌పాడు ప్రాథమికోన్నత పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై పంపించారు. అసలు కొండ్రుపాడు పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై ఎందుకు పంపారు? ఇతర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై ఎందుకు తెచ్చారనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెనుబల్లి జెడ్పీహెచ్ఎస్‌లో అదనంగా ఉపాధ్యాయులు ఉన్నా.. ఎంఈఓ ఇన్‌చార్జ్ కావడంతో సర్దుబాటులో ఈ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రాధాన్యత కల్పించినట్లు విమర్శలు వస్తున్నాయి. వేంసూరు మండలం దుద్దేపూడి యూపీఎస్‌లో పనిచేస్తున్న రవికుమార్‌ను ఖమ్మం, యూపీఎస్ రామన్నపాలెంలో పనిచేస్తున్న బాలాజీని ఖమ్మం డిప్యూటేషన్‌పై పంపించారు. మార్గదర్శకాల ప్రకారం ఆ మండలంలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉన్నప్పటికీ జిల్లా కేంద్రానికి పంపడంపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కాకర్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడు ఉన్నప్పటికీ అదనంగా గణిత ఉపాధ్యాయుడిని పంపించినట్లు తెలుస్తోంది. యూపీఎస్ కొమ్ముగూడెంలో 14 మంది విద్యార్థులకు హిందీ పోస్టు మాజూరు లేనప్పటికీ 330 మంది విద్యార్థులు ఉన్న జెడ్పీహెచ్ఎస్ నుంచి ఉపాధ్యాయురాలిని సర్దుబాటు చేయడంతో ఆమె డీఈఓను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ముగిసిన టీటీ ర్యాంకింగ్ టోర్నీ



బహుమతులు అందజేస్తున్న పునుకొల్లు నీరజ, తుమ్మల యుగంధర్

ఖమ్మం స్పోర్ట్స్ : మూడు రోజులుగా నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన బాలసాని సాన్యసయ్య స్మారక రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడా సంఘాల బాధ్యుల కృషి వల్లే ఖమ్మంలో విరివిగా రాష్ట్రస్థాయి టోర్నీలు జరుగుతున్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, రాష్ట్ర టీటీ అసోసియేషన్ అధ్యక్షులు కె.కె.మహేశ్వరి, కార్యదర్శి సి.నాగేందర్‌రెడ్డి, ఎన్.లక్ష్మీకాంత్, సీనియర్ కోచ్ సోమనాథ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్-11 బాలికల విభాగం ఫైనల్స్‌లో అపర్ణ, యశశ్రీ, అండర్-13 విభాగంలో డి.అవంతిక, బి.వి.మహిమకృష్ణ, అండర్ -15 విభాగంలో బి.వి.మహిమకృష్ణ, గాయత్రి కృష్ణ, అండర్-17 విభాగంలో అవంతిక, పి.జలని, అండర్-19 విభాగంలో కె.శ్రేష్ఠ, వైష్ణవి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలుర అండర్-11 విభాగంలో ఎం.విహాన్, నివాస్, అండర్-13 విభాగంలో సాగర్, పి.వేదాన్ష్, అండర్-15 విభాగంలో జె.ఎ.విలోహిత్, ప్రమాణ్, అండర్-17 విభాగంలో ఎం.ధర్మతేజ సాయి, పి.శ్రీహాసీష్, అండర్-19 విభాగంలో అరుష్‌రెడ్డి, ఎం.దేవాన్ష్, పురుషుల విభాగంలో స్వర్ణెండ్ చౌదరి, బి.వరుణ్ శంకర్, మహిళల విభాగంలో నిఖితా బాను, వరుణి జైస్వాల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం : బందోబస్తులో ఉన్న పోలీసులను నెట్టివేసి, విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. వీడీఓస్ కాలనీలో గొడవ జరుగుతోందనే సమాచారంతో ఎస్ఐ రమేశ్, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లారని, ఈ క్రమంలో చేకూరి శేఖర్‌బాబు, తాళ్లూరి గంగాధర్, కంచర్ల అభిలాష్ ఎస్ఐ రమేశ్‌తో పాటు సిబ్బందిని నెట్టివేశారని తెలిపారు. ఎస్ఐ రమేశ్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు..

తన ఇంటిపై రాళ్లు విసిరారంటూ చేకూరి శేఖర్‌బాబు ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, ఆమె భర్త నరేంద్ర, మరికొందరిపై కేసు నమోదు చేశామని బాలకృష్ణ తెలిపారు. వీడీఓస్ కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్పొరేటర్ మంజుల, ఆమె భర్త నరేంద్ర, మరో మహిళను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారిని రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని వివరించారు.

ఎవరికి వారే.. యమునా తీరే

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది మధ్య కొరవడిన సమన్వయం

ఖమ్మంక్రైం: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. దీంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. కొన్ని నెలలుగా అక్కడి వ్యవస్థ అస్తవ్యస్తమైంది. డీటీఓ పోస్ట్ ఖాళీగా ఉండటం, ఇన్‌చార్జ్‌ల పాలనలోనే నడుస్తుండటంతో కార్యాలయ సిబ్బందిపై అజమాయిషీ చేసే పరిస్థితి లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కీలకస్థాయిలో అధికారులకు మర్యాద కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ఇద్దరు కీలక ఉద్యోగులు

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇద్దరు కీలక ఉద్యోగులు ఉండగా కిందిస్థాయి సిబ్బంది వారిని లెక్కచేసే పరిస్థితి లేదని, వారికి కనీస మర్యాద కూడా దక్కటం లేదని తెలుస్తోంది. నోటి దురుసుతో కార్యాలయంలోనే కీలక బాధ్యతల్లో ఉన్న అధికారి తమను ఇష్టం వచ్చినట్లు అందరిముందే నోరు పారేసుకుంటున్నాడని అలాంటి అధికారికి తాము ఎందుకు మర్యాద ఇవ్వాలని కొందరు కింది స్థాయి సిబ్బంది ఆరోపణలు చేస్తున్నారు. ఎప్పుడైనా పనిలో ఉండి సెల్యూట్ చేయకుండా ఉంటే సదరు అధికారి అది మనస్సులో పెట్టుకొని.. కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని వాపోతున్నారు.

అధికారి నోటి దురుసు..

ఎంతో బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ అందరినీ కంట్రోల్ చేసే అధికారి.. సిబ్బందితో పాటు సేవలకు వచ్చే వాహనదారులను సైతం తన నోటి దురుసుతో ఇబ్బందుల పాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని ఆ అధికారి నోటి దురుసుతో అమర్యాదగా పిలుస్తుండటంతో వారు ఇక్కడి నుంచి బదిలీ అయితే బాగుండని చెబుతున్నారు. రవాణాశాఖ ఉన్నతాధికారులు వెంటనే ఖమ్మం రవాణా శాఖా కార్యాలయంపై దృష్టి పెట్టాలని లేదంటే మరింతగా గాడి తప్పే అవకాశం ఉందని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు.

భార్యతో కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

కేసు నమోదు

మధిర: ఏడేళ్లుగా అక్రమ సంబంధాలు పెట్టుకుని, అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్‌పై ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మధిర పట్టణంలోని బంజారాకాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్‌కు ఏడేళ్ల కిందట మౌనికతో వివాహం జరిగింది. శ్రీకాంత్‌తో పాటు అతని తల్లి నాగమణి, భార్య మౌనిక ముగ్గురు కలిసి మధిరలో జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా అదనపు కట్నం కోసం శ్రీకాంత్ అతని తల్లి నాగమణి వేధింపులకు గురిచేస్తున్నారు. పలుమార్లు పంచాయితీ పెట్టించినప్పటికీ శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో మౌనిక పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించగా వారు.. శ్రీకాంత్‌కు నచ్చజెప్పారు. అయినా శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు కేసు పూర్వాపరాలు తెలుసుకుని ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్, అతని తల్లి నాగమణిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మౌనికను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

కల్లూరు: ఏపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆదివారం ఉదయం కల్లూరుకు ఇసుక లారీ రాగా పోలీసులు పట్టుకున్నారు. ఏపీలో టన్ను ఇసుక ధర రూ.600 ఉండటంతో ఎన్‌టీఆర్ జిల్లా పెనమనూరు మండలం ఉయ్యూరు గ్రామానికి చెందిన డ్రైవర్ ఆనగాని రాంబాబు, లారీ యజమాని పిట్ల సాంబయ్య.. కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన బోగినబోయిన నాగరాజు కోసం లారీలో ఇసుక తరలించారు. అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్


చర్ల - భద్రాచలం మార్గంలో ట్రాఫిక్ జామ్

దుమ్ముగూడెం: మండలంలో ఇసుక లారీలు వందల సంఖ్యలో రావడంతో తూరుబాక నుంచి పెద్దనల్లబల్లి వరకు కొన్ని కిలో మీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏపీలోని సీతపేటం వద్ద భద్రాచలం – చర్ల ప్రధాన రహదారిపై రెండు ఇసుక లారీలు దిగబడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వందల సంఖ్యలో లారీలు ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో సామాన్య ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఇసుక లారీలను ములకపాడు వయా మారాయిగూడెం నుంచి డైవర్షన్ చేసి పంపినప్పటికీ అటువైపు కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ట్రాఫిక్ జామ్ కొనసాగింది.

రహదార్లపైనే నిలుపుతున్న ఇసుక లారీలు


చర్ల: మండలంలో కొనసాగుతున్న ఇసుక క్వారీల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక రవాణా కోసం వచ్చే లారీలకు ఇసుక రీచ్‌ల నిర్వాహకులు యార్డులను ఏర్పాటు చేయకపోవడంతో లారీ డ్రైవర్లు ఎక్కడబడితే అక్కడ లారీలను నిలుపుతుండడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యి గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా తిరుగుతున్న ఓవర్ లోడ్ ఇసుక లారీలు వల్ల రోడ్లు ఎక్కడికక్కడే కృంగిపోయి పెద్ద ఎత్తున లారీలు దిగబడుతున్నాయి. ఇసుక రీచ్‌ల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎందుకు లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కాపర్ వైరు చోరీ

మధిర: మండలంలోని మల్లారం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన ఎత్తిపోతల పథకం కింద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. రెండు రోజుల క్రితం రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌లోని సుమారు రూ.8 లక్షల విలువ చేసే కాపర్ వైరును చోరీ చేశారు. ఘటనపై లిఫ్ట్ చైర్మన్ కరివేద రాంబాబు మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన బైక్

తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


బంధం లక్ష్మీనారాయణ (ఫైల్)

చింతకాని: మండలంలోని నాగులవంచ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం లక్ష్మీనారాయణ (45) మృతి చెందగా అతని కుమారుడు గగన్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావటంతో ద్విచక్ర వాహనంపై తన కుమారుడితో కలిసి ఖమ్మం నుంచి ముష్టికుంట్ల గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో నాగులవంచ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో లక్ష్మీనారాయణతో పాటు కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొద్ది సేపటికే లక్ష్మీనారాయణ మృతి చెందగా, కుమారుడు గగన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం గ్రామానికి చెందిన వివాహిత జంగాల మంగమ్మ (50) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మంగమ్మ ఈ నెల 10వ తేదీన ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు మొదట ఖమ్మం, అనంతరం హైదరాబాద్ తరలించగా.. ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొణిజర్లకు చెందిన ఉప్పతల పవన్‌కుమార్ (23), దుగ్గాల నాగరాజు.. ఏపీలోని తిరువూరులో జరుగుతున్న శుభకార్యంలో ఫొటోలు, వీడియో తీసేందుకు శనివారం మధ్యాహ్నం వెళ్లారు. అర్ధరాత్రి తిరువూరు నుంచి ద్విచక్రవాహనంపై కొణిజర్ల బయలుదేరిన వారిని స్టేజీ పినపాక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ద్విచక్రవాహనం నడుపుతున్న ఉప్పతల పవన్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. దుగ్గాల నాగరాజును 108లో ఖమ్మంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వైరా ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన సంగెపు సుధాకర్

మధిర: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన సంగెపు సుధాకర్ శనివారం రాత్రి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలు నుంచి జారి పడి తీవ్ర గాయాలతో పట్టాల మధ్యలో ఉండగా సమాచారం అందుకున్న మధిర రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఆర్కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు దొర్నాల రామకృష్ణ సహకారంతో మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. గోకినేపల్లికి చెందిన కృష్ణ ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కృష్ణ కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, క్షతగాత్రుడిని 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.